క్లుప్తంగా

భూసార పరీక్షలతో రైతులకు మేలు



మట్టి నమూనా తీస్తున్న రైతు

పాలకొండ రూరల్: రానున్న ఖరీఫ్‌కు సంబంధించి భూసార పరీక్షలు చేయడం ద్వారా భూమిలో ఉన్న సత్తువను తెలుసుకోవచ్చని, తద్వారా సాగు చేయాల్సిన పంటలపై అవగాహన పెంచుకునే అవకాశం ఉంటుందని అభ్యుదయ రైతు టి.ప్రసాదరావు అన్నారు. మండలంలోని రుద్రపేటలో భూసార పరీక్షలకు సంబంధించి మట్టి నమూనాల సేకరణ కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేయడం వల్ల భూమికి ఏయే ఎరువులు వేయాలో తెలుస్తుందని చెప్పారు.

రెల్లిపొదలకు మంటలు



కాలుతున్న రెల్లి పొదలు

సీతంపేట: ఐటీడీఏ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఉన్న రెల్లిపొదలకు శనివారం నిప్పంటుకుంది. పరిసర కార్యాలయాల వరకు మంటలు విస్తరించడంతో ఐటీడీఏ ఏపీఓ సమాచారం మేరకు పాలకొండ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

పారిశుధ్య పనులకు ప్రాధాన్యం



కస్పా వీధిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ రత్నం

పాలకొండ రూరల్: పట్టణంలో పారిశుధ్య పనులకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు నగర కమిషనర్ రత్నం అన్నారు. నగర పరిధిలోని శివారు వార్డుల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కస్పావీధి, కొత్తవీధి, గొడగల వీధి, రెల్లివీధి, రావాడవీధి, గారమ్మకాలనీ పరిసరాల్లో వీధి కాలువల నిర్వహణ, తాజా స్థితిగతులపై ఆరా తీశారు. ఆయా ప్రాంతాల ప్రజలు తెలియజేసిన సమస్యలను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయండి



ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఏపీవో తులసీదాస్

జియ్యమ్మవలస: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఏపీవో తులసీదాస్ శనివారం సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. రోజుకు రెండు పూటలా చల్లని సమయాల్లో వేతనదారులతో పని చేయించాలని, పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని తెలిపారు. బోగస్ మస్తర్లు వేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జేఈ తేజ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

పాలకొండ: మండలంలోని సింగన్నవలస కూడలి వద్ద శనివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. వీరఘట్టం మండలం నడుకూరుకు చెందిన మిడితాన గోవిందరావు తన బంధువుల ఇంట జరుగుతున్న ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కలినడక వెళుతుండగా.. స్థానిక ఆర్టీఓ కార్యాలయం వద్దకు (సింగన్నవలస కూడలి) వచ్చేసరికి సీతంపేట వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న సవర సుక్కయ్య వెనుక నుంచి వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గోవిందరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడ్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గోవిందరావును శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చే శారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రయోగ మూర్తి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించండి

పార్వతీపురం రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ నాయకులు వి.దాలినాయుడు తన నాయకులతో కలసి ఎస్పీ కార్యాలయంలోని ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ పి.రంగనాధంకు వినతిపత్రాన్ని అందించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల మరమ్మతులకు గురికావడం కారణంగా పలు చోట్ల వాహన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. దీంతో పలువురు దివ్యాంగులుగా తయారు కావడంతో పాటు మృత్యువాత పడుతున్నారన్నారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

'తోటపల్లి' పనులపై

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- మాజీ ఎమ్మెల్యే కళావతి



వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ. ఎన్నికల ముందు ఈ ప్రాంతంలో ప్రచారం చేసిన ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తోటపల్లి పాత ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని రైతులను నమ్మించి ఓట్లు దండుకున్నారన్నారు. తీరా గెలిచాక తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులు 25 శాతం కంటే తక్కువ జరిగాయనే సాకు చూపించి అభివృద్ధి పనులను రద్దు చేసి ఈ ప్రాంత రైతులను మోసగించారని ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రజలకు హామీలు ఇవ్వడం.. గెలిచాక ఆ హామీలను నెరవేర్చకుండా డైవర్షన్ రాజకీయాలు చేయడం సీఎం చంద్రబాబునాయుడుకు అలవాటేనని ఎద్దేవా చేశారు. వీరఘట్టం పట్టణ ప్రజలను దశాబ్దాల కాలంగా వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.5.50 కోట్లతో పట్టణ ప్రధాన రహదారిని అభివృద్ధి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. సమావేశంలో వండువ సర్పంచ్ మిడితాన కల్యాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు భోగి మణి, పిన్నింటి శ్రీను, అంబళ్ల రవి, శంభాన శ్రీను, గెంబలి మహేష్, అసిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణకు మళ్లీ తుపాకీ పడతాం..

- పహల్గాం మృతులకు మాజీ సైనికుల నివాళి



ర్యాలీ చేస్తున్న మాజీ సైనిక ఉద్యోగుల సంఘ సభ్యులు, ప్రజలు

పాలకొండ రూరల్: దేశ రక్షణ కోసం అవసరమైతే మళ్లీ తుపాకి పట్టి పాకిస్తాన్‌కు బుద్ధి చెబుతామని మాజీ సైనికుల సంఘం స్పష్టం చేసింది. పహల్గాం ఘటనలో ముష్కరుల తూటాలకు అశువులు బాసిన మృతులకు నివాళులర్పించింది. ఈ క్రమంలో శనివారం స్థానిక సంఘ కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రస్తుత, పూర్వపు అధ్యక్షులు శేఖర్, దుప్పాడ పాపినాయుడు మాట్లాడుతూ.. భారత్‌పై అక్కసుతో ఉగ్రమూకలు, తీవ్రవాదులు అమాయకులను పొట్టన పెట్టుకోవడం సరైనది కాదన్నారు. ధైర్యం ఉంటే నేరుగా తలపడాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో స్థానికులు స్వచ్ఛందగా పాల్గొని మృతుల కుటుంబాలకు అండగా ఉంటామంటూ నినదించారు.

అనుమానితుల వేలిముద్రల సేకరణ



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీసుల తనిఖీలు

పాలకొండ రూరల్: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలలో డివిజన్ కేంద్రమైన పాలకొండలో పోలీస్ వర్గాలు శనివారం ముమ్మర తనిఖీలు చేపట్టాయి. ముఖ్య కూడళ్లు, ఆర్టీసీ కాంప్లెక్స్, హోటళ్లు, లాడ్జీల్లో సీఐ మీసాల చంద్రమౌళి నేతృత్వంలో సిబ్బంది, బాంబ్ డిస్పోజల్ (బీడీ)టీమ్ తనిఖీలు చేపట్టారు. నేర చరిత్ర కలిగి ఉన్న పాత నేరస్తుల కదలికలపై దృష్టి సారించారు. అనుమానితుల వేలిముద్రలను సేకరించి, వారి నేరచరిత్రపై ఆరా తీశారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్సై కె. ప్రయోగమూర్తి ప్రజలకు సూచించారు.

ఏఓకు పదోన్నతి

సీతానగరం: మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి(ఏఓ) ఎంఎల్ఎన్ ప్రసాద్ ఎంపీడీఓగా పదోన్నతి పొందారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయానికి శనివారం సీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



ర్యాలీలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు

గరుగుబిల్లి: మేడే స్ఫూర్తితో మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా చేపట్టబోయే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ కోరారు. మండల కేంద్రంలో శనివారం పలువురు కార్మికులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం సమావేశం నిర్వహించారు. కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని, కార్మికులను కట్టుబానిసలుగా మలిచేలా లేబర్ కోడ్‌లు ప్రవేశ పెట్టిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను కూడా కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని చూస్తోందని విమర్శించారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తున్న ఉద్యోగులు, కార్మికులను ఇబ్బంది పెట్టేలా చర్యలు చేపడుతుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రజలకు మేలు చేసే చట్టాలు, కార్యక్రమాలు చేయాలని హితవుపలికారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కిశోరి బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న భద్రగిరి ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి



సీతంపేట: మాట్లాడుతున్న సీడీపీఓ రంగలక్ష్మి

గుమ్మలక్ష్మీపురం: కిశోరి బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని భద్రగిరి ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోరి బాలికల ఆరోగ్యం, వికాసంపై అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, డ్వాక్రా గ్రూపు మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. కిశోరి బాలికల్లో రక్తహీనత నివారణకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలివ్వాలన్నారు. ప్రతిరోజూ వారు పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండల కేంద్రంలో కిశోరి బాలికల ఆరోగ్యం, వికాసంపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి, సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన

సీతంపేట: స్థానిక ఎంఎంఎస్‌లో సచివాలయ సిబ్బందికి కిశోర వికాసంపై సీడీపీఓ పి.రంగలక్ష్మి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలని సూచించారు. బడిఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పోర్ట్స్, యోగా, నాయకత్వ లక్షణాలపై వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జి.గౌరి, విస్సమ్మ, లావణ్య, ఏపీఎం పార్వతి పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకోవాలి

బలిజిపేట: పచ్చిరొట్ట ఎరువుల వలన భూసారం పెరిగి పంట పొలాలకు మంచి సేంద్రీయ ఎరువు లభిస్తుందని ఏఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు. బర్లిలో ప్రి మాన్సూన్ డ్రై షోయింగ్ (పీఎండీఎస్)పై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రధాన పంటకు ముందు సుమారు 30 రకాలు ఎకరాకు కనీసం 12కిలోలు చొప్పున విత్తనాలు చల్లుకొని 40రోజుల తరువాత దానిని భూమిలో కలియదున్నడంపై వారికి అవగాహన కల్పించారు. వివిధ రకాల విత్తనాలు వేయడం వలన ఎకరాకు సుమారు 8మెట్రిక్ టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందన్నారు. దీనివలన తేమశాతం పెరుగుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పంట నేల వాలిపోదన్నారు. దీనిపై రైతులు అవగాహన కల్పించుకుని దీనిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మి, తిరుపతిరావు, ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

మండల సమావేశానికి అధికారుల డుమ్మా..

- మండిపడిన ఎంపీపీ శెట్టి పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి పద్మావతి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు హాజరుకాకపోవడం పట్ల ఎంపీపీ శెట్టి పద్మావతి మండిపడ్డారు. మూడు నెలలకోసారి జరిగే సమావేశాలకు కూడా రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజాప్రతినిధులు సమావేశానికి వస్తే అధికారులు రాకపోవడం సమంజసం కాదన్నారు. ఇలా అయితే ప్రజల సమస్యలు ఏ విధంగా పరిష్కారమవుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయాన తన ఐదెకరాల పొలంలో వేసిన అరటి పంట ఇటీవల వానగాలికి పడిపోయిందని, నష్టపరిహారానికి వీఆర్‌వోకు సమాచారం ఇచ్చానని, వీఆర్వో, వీఏఏలు క్షేత్రస్థాయి పరిశీలన చేసి తహసీల్దారుకు నివేదిక ఇచ్చారని అయినా ఇంతవరకు పరిహారం ఇస్తున్నట్టా.. లేనట్టా అనే సమాచారం కూడా లేదన్నారు. అలాగే ఇటీవల చేసిన సర్వేలో తాను బతికి ఉండగానే డెత్‌ల జాబితాలో తన పేరు నమోదు చేశారని.. ఇలాగేనా పనిచేసేది అని అధికారులను నిలదీశారు. తహసీల్దారు రమణమ్మ, ఎంపీపీ మధ్య కాస్త వాగ్వాదం నెలకొంది. అనంతరం సమావేశానికి హాజరైన కొన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అలాగే సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లోని సమస్యలను తెలియజేశారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని అధికారులకు ఎంపీపీ సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ గొర్లె సుజాత, ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఒక్కపూటే ఉపాధి పనులు..



ఎమ్మెల్యే జయకృష్ణ సమక్షంలో వేతనదారుల సమస్యలను వివరిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్

భామిని: ఎండలు మండుతున్న నేపథ్యంలో ఉపాధి పనులు ఒక్కపూట మాత్రమే చేపట్టాలని ఎమ్మెల్యే జయకృష్ణ అన్నారు. ఎంపీపీ తోట శాంతికుమారి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని అభివృద్ధి పనులపై సమీక్షించారు. సమావేశానికి రెవెన్యూ అధికారులు హాజరు కాకపోడవంపై ఎమ్మెల్యే జయకృష్ణ మండిపడ్డారు. భూ సమస్యలు పేరుకుపోతున్నాయని, కార్యాలయానికి వచ్చి ప్రజలు సమస్యలు తెలియజేస్తున్నా పరిష్కారం కావడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఉపాధి వేతనదారులకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ బి.సంధ్యారాణి, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో వేగం పెంచండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సంధ్యారాణి

మక్కువ: ప్రభుత్వ పథకాల అమల్లో వేగం పెంచాలని, పారదర్శకంగా అమలు చేయాలని గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆమె శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. పల్లె ప్రగతి, హరిత హారం సముదాయ శుభ్రత, నీటి సరఫరా, పింఛన్ల పంపిణీ, గృహ నిర్మాణాలు, విద్యుత్ సరఫరా, పాఠశాలల ఆధునీకీకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు స్వీకరించే సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అంతకు ముందు స్థానిక సాయి భగవాన్ కల్యాణ మండపంలో టీడీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ డీడీ స్వరూపరాణి, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం తదితర అధికారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు



- మట్టి నమూనాల సేకరణకు ఇదే అనువైన సమయం
- రైతుసేవా కేంద్రాల సాయంతో భూసార పరీక్షలు

బలిజిపేట: భూముల్లో ఇష్టానుసారం పంటలను సాగు చేస్తుండడంతో భూసారం తగ్గి పంట దిగుబడులు తగ్గుతున్నాయి. వాటిని నియంత్రించేందుకు, ఎరువులను అధికంగా వాడకుండా ఉండేందుకు భూసార పరీక్షలు ఎంతో అవసరం. రైతులు తమ భూముల్లో భూసార పరీక్షలు చేయించడం ఎంతో అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షల వలన రైతుల భూములలో ఏ మేరకు, ఏఏ ఎరువులను, సూక్ష్మ పోషకాలను వినియోగించుకోవాలో వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు అందిస్తారు. మండలంలో 1604 భూసార పరీక్షలు లక్ష్యంగా నిర్దేశించారు. వీటిలో ఇప్పటికే 84పరీక్షలు నిర్వహించడం జరిగింది.

మూడు దశల్లో భూసార పరీక్షలు

మట్టి నమూనా సేకరణ. భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు. ఫలితాల లాధారంగా ఎరువుల సిఫార్సు.

మట్టి సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పొలం గట్ల పక్కన తీయకూడదు. నీటి ముంపు ఉన్న దగ్గర తీయరాదు. చేట్ల నీడ ఉన్న దగ్గర, చెట్ల వేర్లు వ్యాపించి ఉన్న దగ్గర తీయరాదు. సేంద్రీయ, రసాయనికి ఎరువులు వేసిన తర్వాత తీయరాదు. సేంద్రీయ, రసాయనిక ఎరువులు వేసిన 50రోజుల తర్వాత మట్టి నమూనాలు తీయాలి. చౌడు ఆమ్ల నేలల్లో, ఇతర ఏ సమస్యాత్మక నేలల్లోనైనా వేరువేరుగా మట్టి నమూనా సేకరించాలి. 15–30సెంటీమీటర్ల లోతులో మట్టి నమూనాలు సేకరించాలి. ఎటువంటి చెత్త ఉన్న దానిని తొలగించి 15–30సెంటీమీటర్ల లోతులో 'వి' ఆకారం గుంత చేసుకోవాలి. ఒకే మందంలో పైనుంచి కింద వరకు పలచని పొరలుగా తీసుకుని మట్టిని సేకరించాలి. జిగ్‌జాగ్ పద్ధతిలో ఒక ఎకరాకు 8నుంచి 10చోట్ల రెండు కిలోల మట్టిని సేకరించాలి. దీనిని ఒక గోనెపై వేసుకుని నీడలో ఆరబెట్టి ఏదైనా మట్టి గడ్డలు ఉంటే వాటిని చిదిమేయాలి. తరువాత దానిని 4 భాగాలు చేసుకుని ఒకొక్క భాగంలో నుంచి కొంత మట్టిని తీసుకుని ఒక కిలో మట్టిని తయారు చేసి నమూనాకు తీసుకోవాలి. వేసే పంటను బట్టి నమూనా సేకరణ మారుతుంది. స్వల్పకాలిక పంటలకు 15–20సెంటీమీటర్ల లోతు తీయాలి. తోట పంటలకు 3–4అడుగులు తీయాలి.



మిర్తివలసలో భూసార పరీక్షలకు మట్టి నమూనాసేకరిస్తున్న ఏఓ

భూసార పరీక్షలు చేయించుకోవాలి

మండలంలో 19 రైతుసేవా కేంద్రాల ద్వారా 1604 భూసార పరీక్షలకు అవసరమైన మట్టి నమూనాలు సేకరించాలని నిర్ధారణ చేయడం జరిగింది. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. భూసారాన్ని గుర్తించి వాటికి అనుగుణంగా ఉండే ఎరువుల వాడకంపై సూచనలు ఇవ్వడం జరుగుతుంది. భూసారం పెరుగుతుంది, ఎరువుల ఖర్చు తగ్గుతుంది.

– ఎం.శ్రావణ్‌కుమార్, ఏఓ, బలిజిపేట

స్థూల, సూక్ష్మ పోషకాలు లోపించకుండా..

మట్టి నమూనాలు పరీక్ష చేసిన తరువాత భూసార పరీక్ష ఫలిత ఆధారంగా సూక్ష్మ, స్థూల పోషకాల యొక్క విలువలను తెలియజేస్తూ వాటి ఆధారంగా రైతులకు అందించే సిఫార్సు. ప్రతీ రైతు సాగు చేసే పంటలలో స్థూల, సూక్ష్మ పోషకాలు లోపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. స్థూల, సూక్ష్మ పోషకాలుగా పిలువబడే నత్రజని, భాస్వరం, పొటాష్, జింకు, బోరాన్, సల్ఫర్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, జిప్సమ్(కాల్షియం, గంధకం) పంటలతో లోపిస్తే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. ఈ లోపాన్ని గుర్తించి సకాలంలో వాటిని వేసుకుని దిగుబడులను పెంచుకోవచ్చు. పోషకాల లోపాలు నివారించడానికి జిప్సమ్, జింకు, పచ్చిరొట్ట ఎరువులు సాగులోకి తీసుకురావాలి. ప్రతీ రైతు తమ పొలాలలో సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం మంచిదని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

తాలాడలో పోలీస్ పికిటింగ్



మండలంలోని తాలాడలో ఎట్టకేలకు పోలీస్ పికిటింగ్ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన గొర్లె భీముడు అనుమానాస్పదంగా మృతి చెందడం.. పోలీసులు నిందితులకు కొమ్ముకాస్తున్నారని మృతుడి కుటుంబ సభ్యు లు ఆరోపిస్తున్న నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు శనివారం పికిటింగ్ ఏర్పాటు చేశారు. –భామిని

ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన



జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ కురుపాం మండలంలోని దురిబిలి గ్రామంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు శనివారం నిరసన చేపట్టారు. 28 మంది పర్యాటకులపై ఉగ్రమూకలు దాడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ అమానవీయ ఘటనపై ప్రపంచ దేశాలు స్పందించాలని, ఉగ్రవాదాన్ని సమష్టిగా రూపుమాపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. –గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

వాహన తనిఖీలు..



సీతంపేట మండల కేంద్రంలోని పీఎంఆర్‌సీ సెంటర్ వద్ద ఎస్సై వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. పాలకొండ – సీతంపేట, కొత్తూరు – సీతంపేట, దోనుబాయి వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ధ్రువపత్రాలు లేనివారికి అపరాధ రుసుం విధించారు. – సీతంపేట